## క్లుప్తంగా

### సొసైటీ అధ్యక్షుడిపై దాడి

**చిలకలూరిపేటటౌన్:** సొసైటీ అధ్యక్షుడిపై దాడి జరిగిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని మురికిపూడి సహకార పరపతి సంఘం అధ్యక్షుడిగా ఆరుమళ్ల వెంకట శివ ఇటీవల నియమితుడయ్యాడు. అదే గ్రామానికి చెందిన మందుల హరికృష్ణ మధ్యాహ్నం సమయంలో వెంకటశివకు పలుమార్లు ఫోన్ చేయగా ఐదోసారి ఫోన్ ఎత్తాడు. నేను ఎన్ని సార్లు ఫోన్ చేసినా ఎందుకు ఎత్తడం లేదని వెంకటశివపై హరికృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో హరికృష్ణ కోపంగా వెంకటశివ కార్యాలయానికి వెళ్లి గొడవపడి దాడి చేశాడు. దీంతో ఇదే విషయాన్ని వెంకటశివ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన పలువురు స్టేషన్‌కు చేరుకొని మాట్లాడుకుందాం రా అని వెంకటశివకు కబురు పెట్టారు. సాయంత్రం స్టేషన్‌కు చేరుకోగా స్టేషన్ ముందే ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. స్టేషన్‌కు మాట్లాడుకుందాం రా అని పిలిపించి తనపై గ్రామానికి చెందిన సీవీ రామన్, మందుల లక్ష్మీనారాయణ, రావు వారి గోపి, రమేష్, సాంబయ్య తదితరులు దాడి చేశారని వెంకటశివ ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారిస్తున్నారు.

### వైభవంగా చౌడేశ్వరీ జ్యోతి ఉత్సవం

**నరసరావుపేట ఈస్ట్:** పాతూరులో వేంచేసియున్న శ్రీచౌడేశ్వరీ అమ్మవారి ఏకాదశ జ్యోతుల మహోత్సవం మంగళవారం తెల్లవారు జామున వైభవంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అమ్మవారికి త్రినేత్రాలంకారణ నిర్వహించి హోమగుండం ప్రజ్వలింప చేశారు. ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన జ్యోతులను ఆలయం నుంచి బయటకు తీసుకవచ్చి పట్టణ వీధులలో ఊరేగింపు నిర్వహించారు. పల్నాడుజిల్లాలోని దొడ్లేరు, కంభంపాడు, గంగవరం, గుంటూరు జిల్లాలోని తక్కెళ్లపాడు, చేబ్రోలు రెడ్డిపాలెం, పొన్నేకల్లు గ్రామాలకు చెందిన తొగట వీర క్షత్రియ సంఘీయులు జ్యోతులను అందంగా అలంకరించి అమ్మవారి భక్తి పాటలతో ఊరేగింపు జరిపారు.

### నాగపవన్‌కుమార్‌కు విశ్వజననీ సేవారత్న అవార్డు

**వినుకొండ(నూజెండ్ల):** పట్టణానికి చెందిన వాసవీ క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి గజవల్లి నాగపవన్ కుమార్‌కు విశ్వజననీ సేవా రత్న అవార్డు లభించింది. నరసరావుపేటలో జరిగిన విశ్వ జననీ ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవ సభలో పవన్‌కుమార్ ఫౌండేషన్ సభ్యుల చేతుల మీదుగా ఈ సేవా రత్న పురస్కారం అందుకున్నారు. అవార్డు పొందిన పవన్‌కుమార్‌ను పట్టణానికి చెందిన విశ్వహిందూ పరిషత్, ఆర్య వైశ్య సంఘం, వాసవీక్లబ్ సభ్యులు, మిత్రులు అభినందించారు.

### శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా రాకేష్

**నరసరావుపేట ఈస్ట్:** అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక ఏపి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన గుండాల రాకేష్ నియమితులయ్యారు. ఈమేరకు సంస్థ చైర్మన్ డాక్టర్ కె.ప్రతాప్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు రాకేష్ మంగళవారం తెలిపారు. సాహిత్య రంగంలో తాను అందిస్తున్న సేవలను గుర్తించి తనను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించటపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఓ గుర్తింపు పొంది తెలుగు వెలుగులను ప్రపంచం నలుమూలలా వెదజల్లుతూ తెలుగు భాషాభివృద్ధికి సేవలందిస్తున్న కళావేదిక ఆశయాలను అనుగుణంగా పనిచేస్తూ భాషాభివృద్ధికి కృషిచేస్తానని తెలిపారు.

### ఘనంగా శంకర జయంతి

**చిలకలూరిపేట:** సమాజంలో ఆధ్యాత్మిక భావనల వ్యాప్తికి ఆది శంకరాచార్యులు బాటలు వేశారని ఆదిత్యా బ్రాహ్మణసేవాసమితి గౌరవ అధ్యక్షుడు చల్లా విజయకుమార్ చెప్పారు. ఆది శంకరాచార్యుల జయంతిని సమితి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముందుగా ఆది శంకరాచార్యుల చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులు ఉత్తమ మార్గంలో పయనించేందుకు ఆదిశంకరాచార్యుల బోధనలు ఎంతగానో దోహదపడ్డాయని చెప్పారు. మానవజన్మ గొప్పతనాన్ని చాటారని వివరించారు. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు ఏకమారుతీరామ శర్మ, కార్యదర్శి పోలూరి రామచంద్రమౌళి, పి.శేషగిరి, కె.లక్ష్మీనారాయణ, జె నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

### భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

**యడ్లపాడు:** భవనంపై నుంచి పడి తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికుడు మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం .. ఒరిస్సా రాష్ట్రం గంజాం జిల్లా గోబిందపూర్ గ్రామానికి చెందిన పవిత్రస్వైన్ కుటుంబం ఉపాధి పనుల నిమిత్తం పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని కల్పతరువు నూలుమిల్లులో ఐదేళ్ల కిందట చేరారు. నాటి నుంచి మిల్లు ఆవరణలోని క్వార్టర్లలో నివాసం ఉంటూ జీవనం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి పవిత్రస్వైన్ (42) మద్యం సేవించి రెండస్తుల భవనంపై ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తలకు తీవ్రగాయాలైన అతన్ని గుంటూరు జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. భార్య కస్తూరిస్వైన్ ఫిర్యాదుతో యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

# శివారు ప్రాంతాల అభివృద్ధి

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- బరంపేటలో నూతన విద్యుత్ సౌకర్యాలకు భూమిపూజ
- గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రజల సమస్యలకు పరిష్కారం
- డీ–2సెక్షన్‌లో పనులకు ప్రభుత్వం రూ.10 లక్షల నిధులు విడుదల


విద్యుత్ స్తంభాల ఏర్పాటు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట:** పట్టణ శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం బరంపేట 32వ వార్డులో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న 34 విద్యుత్ స్తంభాలు, విద్యుత్‌లైన్ల పనులకు టెంకాయ కొట్టి శ్రీకారం చుట్టారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో 31, 32, 33, 34 వార్డుల్లోని శివారు ప్రాంతాల ప్రజలు తమకు విద్యు త్ స్తంభాలు, లైన్లు ఏర్పాటు చేయాలని కోరారన్నా రు. వారి విజ్ఞప్తి మేరకు విద్యుత్, పురపాలక విభాగాలపై ఎటువంటి భారంలేకుండా ప్రభుత్వమే రూ.10 లక్షల నిధులను విడుదల చేసిందన్నారు. ఇప్పటికే ఆరోవార్డు బాబాపేట శివారు ప్రాంతాల్లో కూడా ప్రభుత్వ నిధులతో స్తంభాలు, లైన్ల ఏర్పాటు చేశామన్నారు. విరిగిన స్తంభాలు, ఇనుప స్తంభాలు తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటుచేసి వాటికి వీధిలైట్లు బిగించటం జరుగుతుందన్నారు.

అలాగే రూ.90 లక్షల వ్యయంతో శిశుమందిరం సమీపంలోని హోసన్న మందిరం వద్ద వేసిన సీసీ రోడ్డుతో ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఈ రోడ్డులో మేజర్ డ్రెయిన్ పనులు కూడా త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఇంకా మిగిలిన శివారు ప్రాంతాల ప్రజలకు మౌలిక వసతులు తాగునీరు, విద్యుత్, రోడ్లు లాంటివి కల్పించేందుకు అధికారులు అంచనాలు తయారు చేస్తున్నారన్నారు. వారందరికీ మున్సిపల్ కుళాయిలు ఇస్తామన్నారు. గత మాసంలో పురపాలక సంఘానికి రూ.7 కోట్లు పన్నులు వసూలు కాగా, ఈనెల రూ.3 కోట్లు వసూలు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు.

పెండింగ్ బిల్లులను చెల్లిస్తామన్నారు. నకరికల్లు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు, శాంతినగర్ ట్యాంకుల్లో నీరు పూర్తిగా నింపామన్నా రు. వచ్చే ఆగస్టు వరకు తాగునీటి కొరత ఉండదన్నారు. నాలుగు పిల్టర్ బెడ్లు రూ.37 లక్షల వ్యయంతో మరమ్మతులు చేసి తాగునీటి సమస్యలేకుండా చేశామన్నారు. గడపగడపలో వచ్చిన సమస్యలను తీర్చే అభివృద్ధి పనులు కూడా పూర్తిచేస్తామన్నారు.

**అర్బన్‌హెల్త్ సెంటర్ పనుల పరిశీలన**

ఆరో వార్డులో సుమారు రూ.1 కోటి వ్యయంతో నిర్మాణం పూర్తిచేసుకున్న వైఎస్సార్ అర్బన్ హెల్తెసెంటర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. విద్యుత్, వాటర్, డ్రెయినేజ్ పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో పురపాలక కమిషనర్ డి.శ్రీనివాసరావు, విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆర్.శ్రీనివాసరావు, డెప్యూటీ ఇంజనీర్లు వై.ఏడుకొండలు, వెంకటేశ్వరరెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు ముడియం శేషమ్మ, మాజీ కౌన్సిలర్ కారుమంచి మీరావలి, యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి కాకుమాను సదాశివరెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు జి.అచ్యుతరావు, న్యాయవాది చైతం చిన్నపరెడ్డి, వార్డు నాయకులు పుల్లంశెట్టి శ్రీనివాసరావు, షేక్ మీరావలి, సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి ఎన్‌కే ఆంజనేయులు, మున్సిపల్, విద్యుత్‌శాఖల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పౌరాణిక, జానపద కళలను ఆదరించాలి

**ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి**


బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

**రొంపిచర్ల:** పౌరాణిక, జానపథ కళలను ఆదరించాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలో ఆల్‌ఇండియా కళారంగ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నిర్వహించిన పౌరాణిక పద్య, ఏకపాత్రల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామానికి చెందిన ఆర్మోనిస్టు గురువు మందలపు కేశవులు వర్థంతి సందర్భంగా పోటీలను నిర్వహించటం ఆనందదాయకమన్నారు. డీవీ సుబ్బారావు లాంటి కళాకారులు సత్యహరిశ్చంద్ర నాటకంలో కాటిసీను పాత్రలో పద్యాలు పాడేవారన్నారు. అలాంటి కళాకారుల నాటకాలు ఎంత దూరంలో ప్రదర్శిస్తున్నా వ్యయప్రసాలకోర్చి చూసేవారన్నారు.

ఈ పోటీలలో పాల్గొని విజేత లైన వారికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రవితేజ, వైఎస్సార్‌సీపీ నాయకులు పచ్చవ రవీంద్రబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల సాంబశివారెడ్డి, కురుగుంట శ్రీనివాసరెడ్డి, గుండాల వెంకటేష్, చీమల శ్రీనివాసరెడ్డి, గజ్జల ముసలారెడ్డి, పడాల హనిమిరెడ్డి, కళారంగ సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలలో మినరల్ వాటర్ మిషన్

**శావల్యాపురం:** వేసవికాలం ఎండ తీవ్రత ప్రభావం ధాటికి చిన్నారులకు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రతి అంగన్‌వాడీ సెంటరు నందు మినరల్ వాటర్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు సీడీపీవో ముదివర్తి అనురాధ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సీడీపీవో మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటరు నందు 20 లీటర్ల కలిగిన మినరల్ వాటర్ పరికరం రూ.20 వేలు విలువ చేయు ప్రభుత్వమే ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మిషన్ వాత్సల్య పథకంలో వినుకొండ, శావల్యాపురం, నూజెండ్ల మండలాల నుంచి ఇప్పటికే 600 దరఖాస్తులు అందగా 400 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. సూపర్‌వైజర్లు కుప్పం శ్రీలత, శేషకుమారి ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతో దోమల నియంత్రణ


చిలకలూరిపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది


బొల్లాపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యబృందం


వినుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది

**వాడవాడలా మలేరియా నిర్మూలనపై అవగాహన ర్యాలీలు**

**చిలకలూరిపేట:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్వీ చలమారెడ్డి చెప్పారు. ప్రపంచ మలేరియా దినాన్ని పురస్కరించుకొని మలేరియా నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహనా ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నియంత్రణ ద్వారా మలేరియా వంటి వ్యాధులను నియంత్రించవచ్చని చెప్పారు. దీని కోసం ఇంటి పరిసరాలలో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పట్టణంలోని యూపీహెచ్‌సీల ప్రాంతాలలో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్లు, వైద్య సిబ్బంది, మలేరియా సబ్ యూనిట్ సిబ్బంది ఎస్.శివయ్య, బీఎస్ కోటేశ్వరరావు, ఎస్‌కె జిలాని, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**బొల్లాపల్లిలో...**

**బొల్లాపల్లి:** మండలంలోని వెల్లటూరు, బొల్లాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అంతర్జాతీయ మలేరియా దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య బృందం పీహెచ్‌సీ నుంచి ర్యాలీగా గ్రామవీధుల్లో మలేరియా గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు శంకరనారాయణ మాట్లాడుతూ దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా తగు పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. గృహాల్లో ఎక్కువ కాలం నీరు నిల్వ ఉండరాదని తెలిపారు. వైద్య, ఆరోగ్యో శాఖ, పంచాయతీ ఆధ్వర్యంలో దోమ నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ప్రకాష్‌బాబు, చలపతిరావు, దామోదర్‌శర్మ, అరుణ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**వినుకొండలో...**

**వినుకొండ(నూజెండ్ల):** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని వినుకొండ సీహెచ్‌సీ నందు వినుకొండ రూరల్, అర్బన్ వైద్య,ఆరోగ్య సిబ్బంది ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు దోమ పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని, ప్రతి శుక్రవారం ఇంటి పరిసరాలలో ఉన్న నీటి నిల్వలను మార్చి కడిగి ఎండబెట్టి మరలా నీటిని నింపుకోవాలని, ఫ్రైడే డ్రైడే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ రామానాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బుచ్చిబాబు, ఎస్‌వీ. సుబ్బారావు, పి.బాలస్వామి, కె.వెంకట్రావు, రత్నకుమారి పాల్గొన్నారు.

**శావల్యాపురంలో...**

**శావల్యాపురం:** ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య ఆరోగ్య అధికారుల సారథ్యంలో అవగాహన సదస్సుతో పాటు ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం మాట్లాడుతూ గ్రామాల్లోని వైద్య ఆరోగ్య సిబ్బంది దోమకాటు వలన వచ్చే వ్యాధుల గురించి ప్రజల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. దోమల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉంచరాదని, అందరు దోమతెరలు వినియోగించాలన్నారు. దోమకాటు నుంచి అందరు రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరవపల్లి సూర్యకుమార్, సాయిగీతా, స్టాఫ్‌నర్సు బాలిబోయిన లక్ష్మీప్రసన్న, ధనలక్ష్మి, ప్రమీల, ఆరోగ్య కార్యకర్తలు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


శావల్యాపురం ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య అధికారులు

**రొంపిచర్లలో....**

**రొంపిచర్ల:** మండలంలో వి.రెడ్డిపాలెం, రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలో గల గ్రామాలలో ప్రపంచ మలేరియా దినోత్సవ అవగాహన ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్న డీడీఓ డా.ఎస్.రేవతిభాయి, వైద్యాధికారి డా. మురళీధర్ మాట్లాడుతూ మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు ఎక్కువగా పెరుగుతాయని అన్నారు. ఇళ్ల ముందు ఉన్న మురికి కాలవలలో టైర్లు, తాగి పడవేసిన కొబ్బరిబొండాలల్లో నీరునిల్వ ఉండకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఇఓలు సురేష్, శ్రీనివాసనరావు, పిహెచ్ ఎన్ సుజాతకుమారి, హెల్త్ సూపర్ వైజర్ అబ్దుల్ రహమాన్, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


రొంపిచర్లలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

**యడ్లపాడులో...**

**యడ్లపాడు:** ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని యడ్లపాడు ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో వచ్చే జ్వరాలు, నివారణా చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్లెక్సీ, ఫ్లకార్డులను పట్టుకుని గ్రామంలోని ప్రధాన వీధుల్లో పర్యటిస్తూ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి గోపీనాయక్ మాట్లాడుతూ చలితో కూడిన జ్వరం, తలనొప్పి, వికారం, వాంతులు వంటివి వచ్చిన వెంటనే నిర్లక్ష్యం చేయక ఆస్పత్రికి రావాలన్నారు.

అలాగే ఆస్పత్రిలో అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో పున్నారావు, సూపర్‌వైజర్లు వి రాజశేఖర్, కోటేశ్వరరావు, గంగానమ్మ, పెర్సీ, సిబ్బంది పాల్గొన్నారు.


యడ్లపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

### అక్రమ సారా కేసులో నిందితుడి అరెస్ట్

**నరసరావుపేట టౌన్:** అక్రమ నాటుసారా, మద్యం కేసుల్లో పరారీలో ఉన్న నిందితుడిని అరెస్ట్ చేసినట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ సురేంద్రబాబు మంగళవారం తెలిపారు. పమిడిపాడు గ్రామంలో రెండు నెలల క్రితం బండ్ల హరికృష్ణ అక్రమ నాటుసారా విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆ సమయంలో నిందితుడు పరారయ్యాడన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి అతని కోసం గాలిస్తుండగా పమిడిపాడు శివారు పడ్డుబడ్డారన్నారు. అదేవిధంగా గతంలో పట్టుబడ్డ తెలంగాణ అక్రమ మద్యం కేసులో కూడా హరికృష్ణ నిందితుడిగా ఉన్నాడన్నారు. రెండు కేసుల్లో అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఐఎంఏ సహకారం అభినందనీయం

- అభినందించిన కలెక్టర్
- సమావేశపు మందిర నిర్మాణానికి ఐఎంఏ సభ్యుల హామీ


జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఐఎంఏ సెక్రటరీ డాక్టర్ వెంకటేశ్వరరావు

**నరసరావుపేట:** జిల్లా అభివృద్ధికి భారతీయ వైద్య మండలి (ఐఎంఏ) సహకారం అందించడంపై జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అభినందించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఐఎంఏ నరసరావుపేట కార్యదర్శి డాక్టర్ కడియాల వెంకటేశ్వర్లు, డాక్టర్ మధుసూదన్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పల్నాడు జిల్లా అభివృద్ధికి ఐఎంఏ సహకారం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి కలెక్టర్ చేస్తున్న కృషిని కొనియాడారు. కలెక్టరేట్ పరిసరాలలో సభలు సమావేశాలు నిర్వహించుకునేందుకు ఐఎంఏ సహకారంతో సుమారు 250 మందితో సమావేశం నిర్వహించుకునేందుకు వీలుగా అన్నీ వసతులతో భవన నిర్మాణం స్వచ్ఛందంగా పూర్తిచేసి అందించేందుకు కృషి చేస్తామని కలెక్టర్‌కు తెలియజేశారు. దీనికి వారిని కలెక్టర్ అభినందించారు. అచ్చంపేట, పిడుగురాళ్ల, చిలకలూరిపేట, వినుకొండ తదితర మండలాలకు చెందిన ఐఎంఏ సభ్యులను సమన్వయపరచుకుని పల్నాడు జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కలెక్టర్ సూచించారు. వారివెంట వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి డాక్టర్ జి. శోభారాణి పాల్గొన్నారు.

## జగనన్నపై ప్రజలకు అపార నమ్మకం

- ఇందుకు పీపుల్స్ సర్వే నిదర్శనం
- కొనియాడిన వైఎస్సార్ సీపీ నేతలు


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

**చిలకలూరిపేట:** ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిపై ప్రజలు అపార నమ్మకం కలిగి ఉన్నారనేందుకు మెగా పీపుల్స్ సర్వేకు లభిస్తున్న ఆదరణే నిదర్శనమని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. జగనన్నే మా భవిష్యత్ మెగా పీపుల్స్ సర్వేలో కోటి కుటుంబాలు పాల్గొనగా... సీఎం జగనన్న పాలనకు మద్దతుగా 79 లక్షలకు పైగా మిస్‌డ్ కాల్స్ వచ్చిన సందర్భంగా వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం పార్టీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సర్వేకు ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోందని చెప్పారు. మెగా పీపుల్స్ సర్వేకు క్షేత్ర స్థాయిలో వస్తున్న ప్రతిస్పందన చూసి ప్రతిపక్షాలు ఉలిక్కి పడుతున్నాయని చెప్పారు. ఇది ప్రతిపక్ష పార్టీలకు నిద్రలేని రాత్రులు గడిపేందుకు కారణమౌతోందని తెలిపారు. ప్రతినెలా ఒకటో తేదీన పింఛన్లు పొందుతున్న వృద్ధుల ఆశీస్సులతో సర్వే ఫలితాలు ప్రతిబింబిస్తున్నాయని చెప్పారు. అమ్మఒడి కృతజ్ఞతతో పిల్లలను బడికి పంపుతున్న తల్లుల చిరునవ్వుల్లో సర్వే ఫలితాలు కనిపిస్తున్నాయని వెల్లడించారు. తమ వ్యాపారాలు విస్తరించుకునేందుకు సీఎం జగనన్న సారథ్యంలో ఆర్థిక సహాయం అందుకున్న వ్యాపారుల ఆత్మవిశ్వాసంలోనూ ఇది కనిపిస్తుందని వెల్లడించారు. విదేశీదీవెన, సొంతింటి కల వంటి అనేక పథకాలలోసర్వే ఫలితాలు ఉన్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రం మొత్తం మా నమ్మకం నివ్వే జగనన్న అని ప్రజలు గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్ర ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు విడదల గోపీనాథ్, పఠాన్ తలహాఖాన్, కొలిశెట్టి శ్రీనివాసరావు, తోట బ్రహ్మస్వాములు, రాచమంటి చింతారావు, బండ్ల శ్రీనివాసరావు, బేరింగ్ మౌలాలి, గుంజి వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## మండలాన్ని అభివృద్ధి పథంలో నిలపాలి

**సర్వసభ్య సమావేశంలో జెడ్పీటీసీ మస్తాన్‌రావు**


ఉత్తమ పురస్కారాలు అందుకున్న సర్పంచ్, కార్యదర్శులను సన్మానిస్తున్న ఎంపీపీ రాణి

**నాదెండ్ల:** ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధిపథంలో మొదటిస్థానంలో నిలపాలని జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు చెప్పారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ తలతోటి రాణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన ఎండుగుంపాలెం సర్పంచ్ గట్టినేని నాగేశ్వరరావు మృతి పట్ల మౌనం పాటించి సంతాపం తెలిపారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో ఏ గ్రామంలో కూడా తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ఏడాది ఉపాధి హామీ పథకంలో ఎక్కువ పనిదినాలు కల్పించి వారికి మెరుగైన వసతులు కల్పించాలన్నారు. ఎంపీపీ తలతోటి రాణి మాట్లాడుతూ, మండలంలోని తూబాడు, ఇర్లపాడు గ్రామాలకు పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ సేవా పురస్కారాలు అందుకోవటం అభినందనీయమన్నారు. కనపర్రు సర్పంచ్ పెరుమాళ్ళపల్లి వెంకటేశ్వర్లు, ఇర్లపాడు సర్పంచ్ మంగు రమాదేవి మాట్లాడుతూ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉన్న టీచర్ల పనితీరు బాగాలేదని, సీడీపీవో, సూపర్‌వైజర్లు తనిఖీలు చేసి వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఈవో ఆంజనేయులు మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరానికి గాను జూన్‌లో అన్ని పాఠశాలలకు జగనన్న విద్యాకానుక కిట్లు అందించనున్నట్లు తెలిపారు. వైద్యాధికారి ప్రియాంక మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ పథకానికి గాను స్థానిక ప్రజాప్రతినిధులు వైద్యశిబిరాల నిర్వహణకు సహాయపడాలన్నారు. ఏవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఖరీఫ్ ప్రారంభానికి ముందు 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచుతామన్నారు. రైతు భరోసా రాని వారు ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సీడీపీవో శాంతకుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని చిన్నారుల కుటుంబాలకు మిషన్ వాత్సల్య దరఖాస్తు చేసుకుని ఆర్థికసాయం పొందాలని సూచించారు.

**సర్పంచ్, కార్యదర్శులకు సన్మానం**

పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయంలో ఉత్తమ పంచాయతీ పురస్కారాలు అందుకున్న ఇర్లపాడు సర్పంచ్ మంగు రమాదేవి, కార్యదర్శి ఎన్ మాధవి, తూబాడు సర్పంచ్ గోళ్ళమూడి కాశయ్య, కార్యదర్శి జంగు జరీనాబేగంలను ఎంపీపీ రాణి, జెడ్పీటీసీ మస్తాన్‌రావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు పూలమాలలతో సన్మానించారు. ఇటీవల పీఏసీఎస్ చైర్మన్లుగా ఎంపికైన మంగు ఏడుకొండలు, కురుగుంట్ల వెంకటరెడ్డిలను పూలమాలలతో అభినందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, మండల పార్టీ అధ్యక్షుడు మద్దారి కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సాహంగా మా నమ్మకం నువ్వే జగన్


మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు

**వినుకొండ(నూజెండ్ల):** జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా నూజెండ్ల మండలంలోని తిమ్మాపురం, పుచ్చనూతల, బుర్రిపాలెం గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను గురించి తెలియజేశారు. ప్రతి కుటుంబం పొందిన లబ్ధిని వివరిస్తూ కార్యక్రమం స్టిక్కర్‌లను గృహాలకు అంటించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, నూజెండ్ల మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, జెడ్పీటీసీ జడ్డా సుబ్బులు రామయ్య, మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల చిన్నబ్బాయి, మాజీ చైర్మన్ గంధం బాలిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

**గణపవరంలో...**

**నాదెండ్ల:** మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలోని మూడో సచివాలయం పరిధిలో మంగళవారం ముమ్మరంగా వలంటీర్లు, గృహసారథులు సచివాలయ కన్వీనర్లు ఆధ్వర్యంలో మా భవిష్యత్ నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి నాలుగేళ్ల వైసీపీ పాలనలో అమలైన సంక్షేమ పథకాలను వివరించారు. యజమానుల అనుమతితో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి స్టిక్కర్‌ను అంటించారు. సంక్షేమ పథకాలు అందుతున్న ప్రతి కుటుంబం వచ్చే సాధారణ ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు షేక్ ఆదంవలి, తులం సుధాకర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, వైసీపీ నాయకులు ఆంజనేయులు, కోటేశ్వరరావు, గాలి హనుమంతరావు, పాల్గొన్నారు.

**వాహనం ఢీకొని..**

**నాదెండ్ల:** ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి గాయాలపాలైన సంఘటన మండలంలోని గణపవరం లో చోటు చేసుకుంది. సీఆర్ కళాశాలలో కూలీగా పనిచేస్తున్న కొర్నేటి దాసు ద్విచక్రవాహనంపై చిలకలూరిపేట వెళ్తుండగా కళాశాల వద్ద రాయిఢీకొని వాహనం అదుపుతప్పి క్రిందపడ్డాడు. దీంతో తలకు గాయం కావడంతో 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు.